ఇదీ వుత్తరం-ఆమె దగ్గరనుంచి వొచ్చిన ఉత్తరం. ఈఉత్తరం చదువుకొని నేను ఏమయ్యానో మీకు తెలుసుకోవాలని వుంటుంది.—నెలరోజులు ఖాయిదా పడ్డాను.

---

## భార్యాలోలుడు

"నువ్వు పెద్దవాడివి. పదిమందికి నీతులు చెప్పవలసినవాడివి. నువ్వే ఇట్లాచేస్తే ఎట్లాచెప్పు?" అని అడిగాడు క్రిష్ణయ్య రామ్మూర్తిని.

క్రిష్ణయ్య రామ్మూర్తి స్నేహితుడు. ఏదోపనిమీద వొచ్చినట్టు అదీ ఇదీ మాట్లాడి, అసలు గ్రంథంలోకి దిగాడు.

రామ్మూర్తికి క్రిష్ణయ్యమాటలు అర్థంకాలేదు. కాని ఏదో సీరియస్‌గా సలహాచెప్పటానికి వొచ్చాడనే విషయం మాత్రం తెలిసింది.

"ఇప్పుడు నేనేం చేశాను? సరిగ్గా చెప్పు. లేకపోతేనాకు ఎట్లా తెలుస్తుంది?" అన్నాడు.

క్రిష్ణయ్య కొంచంసేపు తటపటాయించాడు. తాను చెప్పదలచింది ఎట్లా మొదలు పెట్టాలా అని ఆలోచించాడు. ఇలా అన్నాడు—"నీ భార్య మంచిదే అవ్వొచ్చు. నేను కాదనను. కాని నువ్వుమాత్రం కొంచం మంచీ చెడ్డా ఆలోచించుకోనక్కర్లా? ఆమె చెప్పిందంతా నమ్మటమే!" అన్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పవోయ్—నానుడు బేరంతో చంపకా" అన్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తికి, క్రిష్ణయ్య చెప్పదలచింది చూచాయగా తెలిసినట్లుంది.

"నువ్వు నీ భార్య చెప్పిన మాటలు విని నీ చుట్టాలందరితోనూ పోట్లాడుతున్నావటగా! అదేమంత మంచిపని చెప్పు? ఎవరికన్నా తెలిస్తే ఏమనుకుంటారు?" అని అడిగాడు.

రామ్మూర్తి ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు—"ఈసంగతి నీకు ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"నా భార్య చెప్పింది."

---